పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- పనిలేకనే ప్రభుత్వంపై ప్రతి పక్షాల విమర్శలు
- ప్రతి గ్రామ సచివాలయంలో రూ 20 లక్షలతో అభివృద్ధి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- ఐరన్‌బండ, గుమ్మరాళ్ల గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ఐరన్‌బండలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. దేవనకొండ మండలం ఐరన్‌బండ, గుమ్మరాళ్ల గ్రామాలలో గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో దాదాపు అన్ని రకాల పథకాలకు మూడున్నర ఏళ్ల కాలంలో రూ 4 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఫ్యాక్షన్ నేలపై జల సిరులు

మండలంలో గత పాలకుల సమక్షంలో ఫ్యాక్షన్‌తో కూడిన రాజకీయాలు కొనసాగేవని, దీని వల్ల ఎన్నో కుటుంబాలు వీధి పాలయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి దేవనకొండ మండలంలో దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని అమలు చేసి ఫ్యాక్షన్ గడ్డపై జలపాతాన్ని పారించారన్నారు. రైతులు బంజరు భూముల్లో సిరులు పండిస్తున్నారన్నారు. అందుకు తోడుగా తిరిగిసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేసి ఆర్థిక పరిపుష్టిని చేకూరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.

ముగిసిన వృషభాల బలప్రదర్శన పోటీలు


మొదటి స్థానం కైవసం చేసుకొన్న వృషభాలతో యజమాని

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన నాలుగు క్యాటగిరీల విభాగాల ఒంగోలు ఎద్దుల(ఎద్దుల బండలాగుడు) బలప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. చివరిరోజు జరిగిన సీనియర్ క్యాటగిరీ విభాగం వృషభాల పోటీల్లో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మూడురాళ్ల పల్లె వృషభాలు విజేతగా నిలిచాయి. వాటి యజమాని పులిచిన్నఓబుల్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి రూ.1లక్ష నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా రెండో స్థానాన్ని పీఆర్ పల్లె గ్రామానికి చెందిన మంగలినాగయ్య ఎద్దులు కైవసం చేసుకోగా రూ.75వేలు, మూడవ బహుమతిని అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి కె.రామాంజినేయులు వృషభాలు రూ.50వేలు, నాల్గవ బహుమతి నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమాగోవర్ధన్‌రెడ్డి ఎద్దు రూ.30వేల నగదు బహుమతిని దక్కించుకున్నాయి. ఐదో స్థానంలో డోన్ మండలం కొత్తకోటకు చెందిన డాక్టర్ గుర్నాథ్ వృషభాలు రూ.20వేలు బహుమతిగా పొందాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోగనూరు భీమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం వివేకానందుడు


వివేకానందుడి జీవితచరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ మాధురి

పత్తికొండ టౌన్: యువత ఆదర్శం స్వామి వివేకానందుడు అని, ఆయన స్ఫూర్తితో సమసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి అన్నారు. గురువారం పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వివేకానందుడి 160వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సోమశేఖర్ పాల్గొన్నారు. అలాగే యువస్పందన సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో స్వామి వివేకానందుడి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని సీజనల్ హాస్టల్‌లో ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చిన్నహ్యాట నాగరాజు ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఆస్పరి: మండలంలోని ఆలిగేర గ్రామంలో గ్రామ సర్పంచ్ లింగమ్మ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగించారు.

వెల్దుర్తి: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో 1988–89వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న కొందరు పూర్వ విద్యార్థులు గురువారం స్థానిక తిక్కతాత గుడి ఆవరణలో సమావేశమయ్యారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకునిఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మదార్‌పురం పరమేశ్, హరిసంహనాయుడు, హరినాథ్, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. వి.వీరన్న, వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కార్యనిర్వహణ అధికారి రఘు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, వడిబియ్యం, ఆకుపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గంగపూజ చేశారు. రాత్రి జ్యోతుల ఉత్సవం ప్రారంభించారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

మద్దికెర : అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ వీరేంద్రనాథ్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలసలు పోకుండా పనులు చూపుతున్నామని, రైతులు తమ పొలాలలో కావలసిన పనుల గురించి సంబంధిత ఉపాధి సిబ్బందితో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాఘవేంద్ర, విష్ణు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా సేవలందించాలి

వెల్దుర్తి: సచివాలయాల్లో మరింత మెరుగ్గా సేవలందించాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. గురువారం మండల పరిధిలోని పుల్లగుమ్మి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, మూమెంట్ రిజిస్టరు, రికార్డులు పరిశీలించారు. ఇప్పటిదాకా వచ్చిన అర్జీలు, ప్రజలకందిన సేవలు డీఏ కల్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా వీఆర్‌ఓ ఎల్లకృష్ణ, సిబ్బంది ఎల్లారెడ్డి, నవజ్యోతి, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వెల్దుర్తి: పట్టణంలోని పలు ప్రైవేట్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో గురువారం ఏఓ అక్బర్‌బాషా తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, అనుమతి పత్రాలు, స్టాకు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ పాస్ ద్వారా, అనుమతి ఉన్న వాటిని మాత్రమే విక్రయించాలని దుకాణదారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల నిమిత్తం పురుగుమందుల శాంపిల్స్ సేకరించారు.

కక్షలకు దూరంగా ఉండండి

చిప్పగిరి: కక్షలకు, ఘర్షణలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. గురువారం ఏరూరు, చిప్పగిరి, దేగులపాడు తదితర గ్రామాలలో ఫ్యాక్షన్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం అలవాటు చేసుకోవాలన్నారు. ఎంతటి సమస్యలైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఒక వేళ పరిష్కారం కాక పోతే స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

చిప్పగిరి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నార ని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి పక్షాలు పని గట్టికొని పింఛన్లు రద్దవుతున్నాయని అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సీఎం జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నారన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న ఎర్రకోట నిరుపమారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారిణులు క్రీడా స్ఫూర్తితో ఆడి క్రీడల్లో రాణించాలని ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి కె.నిరుపమా రెడ్డి సూచించారు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో వైఎస్సార్ అంతర్ రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మెప్మా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ, కబడ్డీ పోటీల ఆర్గనైజర్లు రామకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

హొళగుంద: వేదావతి నది, ఇతర వంకలు, వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం హొళగుంద పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీంతో సంబంధిత ట్రాక్టరు యజమానులకు జరిమానాలు విధించారు. గుంతకల్లు, ఇతర ప్రాంతాలకు ,చెందిన ఆరు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ

గోనెగండ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బందెనవాజ్, సర్పంచ్ హైమవతి చేతుల మీదుగా కేవీపీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ బొజ్జయ్య, కేవీపీఎస్ నాయకులు మాదన్న, మారేష్, దేవదాసు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

హొళగుంద: ఈ నెల 18న జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేష్ కోరారు. గురువారం హొళగుందలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హమాలి నాగరాజు, కట్టెప్ప, రఫీక్, బాషా పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎస్ఐ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్

క్రికెట్ పోటీలు ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో గురువారం సూపర్ 8 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. గేట్‌మెన్ వెంకట్రాముడు, ఆయన మనుమడు హర్షవర్ధన్ నాయుడుల జ్ఞాపకార్థ నిర్వహించిన ఈ పోటీలను ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్, ఎల్ల, రమణ, గిరి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వల్ల గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగవుతాయని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కృష్ణగిరిలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను గురువారం ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు అంకాల మహాలక్ష్మితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జయరామిరెడ్డి, డీలర్ నారాయణ, హుసేన్‌సాహెబ్, చిన్నపాలు, రమణారెడ్డి, జింకల చిన్నన్న, సుంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఏపీ ఆగ్రోస్' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గిడ్డారెడ్డి



ఎమ్మిగనూరురూరల్: డాక్టర్ వైఎస్సార్ ఏపీ ఆగ్రోస్ ఎంటర్‌ప్యూనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోగనూరు బదినెహల్ గిడ్డారెడ్డిని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం అమరావతిలోని ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నందారపు చెన్నకృష్ణారెడ్డిని, ఉపాధ్యక్షులుగా బి.గిడ్డారెడ్డితో పాటు కమిటీని ఎన్నుకోవటం జరిగింది.

పవర్ లిఫ్టింగ్‌లో వెండి పతకాలు


రాఘవసాయి

ఎమ్మిగనూరు: విశాఖలో జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఎమ్మిగనూరు విద్యార్థి రాఘవ సాయి(18) సత్తా చాటాడు. పట్టణానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ నాగలక్ష్మి, వెంకటేశ్ చిన్నకుమారుడు రాఘవసాయి స్థానిక నలంద కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 4 నుంచి విశాఖపట్టణంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్ 83 కేజీల వి భాగంలో ఓవర్ ఆల్ ఛాంపియన్, డెడ్ లిఫ్టింగ్ లో ద్వితీయ స్థానం పొంది రెండు వెండి పత కాలు సాధించాడు. తల్లిదండ్రులతో పాటు కోచ్ ఆదోని తల్వార్‌ఖాదర్‌బాషా అభినందించారు.

18న ఎస్ఐ, కానిస్టేబుల్ మోడల్ పరీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్ఎంకే కోచింగ్ సెంటర్‌లో ఈనెల 18వ తేదీన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకై మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, పట్టణ నాయకులు అజిత్ తెలిపారు. గురువారం మోడల్ పరీక్షలపై కరపత్రాలను కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ఆశాలుక్మాన్‌తో కలిసి ఆవిష్కరించారు.

కంటి జబ్బులపై అవగాహన అవసరం

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరూ కంటి జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక శ్రీవేంకటేశ్వర కంటి వైద్యశాల వైద్యుడు అడిమి నాగవంశీకృష్ణ సూచించారు. గురువారం పట్టణంలోని వీవర్స్‌కాలనీలోని ఆంజినేయస్వామి ఆలయ ఆవరణలో నవభారత్ సేవాసంస్థ నిర్వాహకుడు నరసింహుడు, శ్రీనివాసులు, లక్ష్మణ్‌సాగర్‌ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో దాదాపు 200ల మందికి కంటి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

బేగరుల సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల: కాటికాపర్లు, గుంతలు తీసే బేగరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్, కాటికార్లు సంఘం మండల అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో గోనెగండ్లలోని గ్రామ సచివాలయాలం వద్ద నిరసన తెలియజేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు మారేష్, మాదన్న, లక్ష్మన్న, జయరాజు, రత్నమయ్య, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో కబడ్డీ పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 14న తాలూకా స్థాయి అండర్–19 కబడ్డీ పోటీలు శ్రీరంగనాథస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు గురువారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి వరుసగారూ.10 వేలు,రూ.7 వేలు,రూ.4 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 13 లోపు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6305717765, 767351222 సంప్రదించాలన్నారు.

సృజనాత్మకత వెలికితీయడానికే పోటీలు

మద్దికెర : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికే పోటీలు నిర్వహించినట్లు ఆపద్బాంధవ సేవాసమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్, డ్రాయింగ్ మాస్టర్ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెల్దుర్తి: స్థానిక ఏపీజీబీ ఆధ్వర్యంలో బోగోలు గ్రామంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు డిపాజిట్లు, రుణ సౌకర్యం, బీమా యోజన, క్రాప్‌లోన్స్, ఎస్‌హెచ్‌జీ రుణాలపై కేఎస్ రూరల్ మీడియా కళాసంస్థ ప్రతినిధులు రమణ, శశి కళాజాత ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ లింగన్న, బీసీ పాయింట్ కరెస్పాండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జేఎం.తండాలో 'గడప గడపకు మనప్రభుత్వం'

పత్తికొండ రూరల్ : కుల, మత పార్టీ భేదాలు లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కంగాశ్రీదేవి అన్నారు. పత్తికొండ మండల పరిధిలోని జేఎం.తండా గ్రామంలో గురువారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేసి మూడేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. అలాగే గ్రామస్తులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు హౌసింగ్ నిర్మాణాలు,పెండింగ్ బిల్లులను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు సీసీరోడ్లు, డ్రైనేజీ పారిశుద్ధ్య సమస్యను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జనరంజక పాలన..

ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. పారదర్శకమైన పాలనను అందిస్తూ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్న సీఎం జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ పార్థసారథి, దూదేకొండ సర్పంచు మజుబుర్ రహిమాన్, కోతిరాళ్ల సర్పంచు ఆంజనేయ, లీగల్‌సెల్ జిల్లా కార్యదర్శి అడ్వకేట్ నరసింహయ్యాచారి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, పార్టీ మండల కన్వీనర్ కారంనాగరాజు, ముస్లిం మైనారిటీ నాయకులు కారుమంచి నజీర్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర సచివాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగిరమేష్‌ను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో సొంత స్థలాలు ఉన్నవారు కొత్తగా గృహనిర్మాణాలు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారని, వారికి అనుమతులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. 3వేల ఇళ్ల మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణాల బిల్లులు జాప్యం లేకుండా అందజేస్తామన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి నాట్లు వేస్తున్న వ్యవసాయాధికారులు

నందవరం : వరి సాగు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో రైతు, గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ పొలంలో వరి పంట సాగుపై క్లస్టర్ స్థాయి వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి నాటు వేసేటప్పుడు నారను సుడోమనస్‌తో 10 నిమిషాలు శుద్ధి చేసి నాటుకోవాలని సూచించారు. పైరును కత్తిరించి నాట్లు వేసుకోవాలని, 5 మీటర్ల నాటుతో 2 సెం.మీ కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని చెప్పారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మల్రి స్రవంతి, ఏఈఓలు ప్రభావతి, సురేంద్రగౌడ్, ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు


మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి తెలిపారు. గురవారం మండల పరిధిలోని గంగవరంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ మొక్కజొన్న సాగు చేసి రైతులు బెంజోయోట్ అనే రసాయన మందును 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపిన ద్రావణం మొక్క సుడులలో 4, 5 చుక్కలు వేయాలన్నారు. తద్వారా కత్తెర పురుగును తొలి దశ లోనే నివారించ వచ్చని చెప్పారు.

ఇంటింటికీ మంచినీటి కుళాయి


జలజీవన్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న గ్రామ సర్పంచ్ శివన్న, అధికారులు

నందవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి ఏర్పాటు చేస్తామని గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్దకొత్తిలిలో ఐఎస్ఏ, ఎస్‌వైఏ టీం సభ్యులు గోరంట్ల ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం విభాగంలో భాగంగా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్ ప్రాజుక్టును ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమన్న, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని షాపులకు తాళాలు


దుకాణానికి తాళం వేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులు అద్దె చెల్లించకపోవడంతో గురువారం మూడు షాపులకు అధికారులు తాళాలు వేశారు. స్థానిక పాత బస్టాండులో గ్రామ పంచాయతీ నిధులతో 48 దుకాణాల కాంప్లెక్స్ నిర్మించారు. ఇందులో షాపుల విస్తీర్ణం బట్టి నెల అద్దె రూ.2 వేల నుంచి 4 వేల వరకు చెల్లిస్తున్నారు. వ్యాపారులు 6 నెలలకు ఒక సారి అద్దె చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో కొంత మంది ఏడాదికి పైగా అద్దె చెల్లించకపోవడతో పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మూడు షాపులకు తాళాలు వేశారు. సకాలంలో అద్దె చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఏఓ కృష్ణ కుమార్ తెలిపారు. సిబ్బంది రాంబాబు, వరుణ్, వినోద్, జీలాన్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జొన్నగిరి ఎస్ఐ రామాంజినేయులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లమ్మగుట్టతండాకు చెందిన ముదావత్ నాగ్యేనాయక్ (58) భార్య తులసి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు కూతుళ్లు, కుమారుడు పెళ్లిళ్ల కోసం, అలాగే కుటుంబ పోషణకు నాగ్యేనాయక్ అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గురువారం గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు చంద్రావత్ నాయక్ బతుకుదెరువు నిమిత్తం విజయవాడలో ఉంటున్నాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 32వ వార్డులోని గొట్టులబీడు ప్రాంతంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, పట్టణ నాయకులు బాలరాజు, సమీవుల్లాలు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

వెల్దుర్తి: మండల పరిధిలోని కొసనాపల్లె గ్రామంలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు తెలిపారు. మండల స్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని వారు కోరారు.